పోలీసు అమరుల త్యాగాలు

మరువలేనివి

అంబర్‌పేట సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

స్మారక స్థూపానికి నివాళులర్పించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



రాచకొండలో గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరుల త్యాగాలు మరువ లేనివని, విధి నిర్వహణలో వారు చేసిన సేవలకు గుర్తుగా ప్రతీ ఏడాది అక్టోబర్ 21ను సంస్మరణ దినంగా పాటిస్తున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం అంబర్‌పేట సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో

మిగతా 8వ పేజీలో...

భళా.. చిత్రకళ!



చిత్రకళలో మేటి సున్నపు అశోక్

మనసులో మెదిలే భావాలకు రంగులు

అనేక చిత్రాలకు ప్రశంసలు, అవార్డులు

మనసులో మెదిలే భావాలకు రంగులు దిద్దుతూ.. ప్రకృతి అందాలను కాన్వాస్‌పై నిక్షిప్తం చేసి దానికి సృజనాత్మకతను జోడించి తన కుంచెతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్దుతున్నాడు. పెయింటింగ్‌లో దౌల్తాబాద్ మండలానికి చెందిన యువకుడు డాక్టర్ సున్నపు అశోక్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. చదివింది అంతంత మాత్రమే అయినా తన కళా పరిమళంతో పలువురి మన్ననలు, ప్రశంసలు, అవార్డులు అందుకున్నాడు. దౌల్తాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

7



సజావుగా గ్రూప్-1 మెయిన్స్

మొదటి రోజు 5,854 మంది హాజరు

- 2,157 మంది గైర్హాజరు
- దివ్యాంగులకు అదనపు సమయం కేటాయింపు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



భాస్కర ఇంజనీరింగ్ కళాశాలలో కలెక్టర్ శశాంక్

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మొదటి రోజు సజావుగా ముగిసింది. రెండు రూట్‌లలో ఏర్పాటు చేసిన 11 కేంద్రాల్లో 5854 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, 2157 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 12.30 నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. 1.30 గంటలకు అధికారులు గేట్లు మూసివేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షలు 27వ తేదీ వరకు కొనసాగుతాయి. పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రతీ కేంద్రం వద్ద ఒక ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తో సహా మొత్తం ఆరుగురు కానిస్టేబుళ్లు బందోస్తులో పాల్గొన్నారు. ఎగ్జామ్ రూమ్, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

ఇబ్రహీంపట్నం పరిధిలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సజావుగా సాగింది. అభ్యర్థి శెట్టి అనిత కాలి గాయంతో గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రానికి వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న ఆమెను బందోబస్తులో ఉన్న పోలీసులు కుర్చీలో కూర్చోబెట్టి కేంద్రంలోకి మోసుకెళ్లారు.

సెంటర్లను సందర్శించిన కలెక్టర్

మొయినాబాద్ రూరల్ : గ్రూపు-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ శశాంక తెలిపారు. మొయినాబాద్ మండల పరిధి కేజీరెడ్డి (ఏ,బీ సెంటర్లు), భాస్కర, విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలలో ఏర్పాటు చేసిన సెంటర్లను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తోపాటు కలెక్టర్ సందర్శించారు. ఏసీపీ కిషన్, సీఐ పవన్‌కుమార్ రెడ్డి, ఎస్సై నర్సింహులు ఉన్నారు.



గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అనితను కుర్చీలో తీసుకొస్తున్న పోలీసులు



చౌదరిగూడ మండలంలో సాగు చేసిన పత్తి పంట

దిగుబడి దిగులు

పత్తి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. కోటి ఆశలతో సాగు చేసిన పత్తి పంటను వరుసగా కురిసిన వానలు దెబ్బతీశాయి. చేలల్లో పదును తగ్గక పంట తెగుళ్ల బారిన పడింది. వివిధ దశల్లో ఉన్న పంట పూత, కాయ రాలిపోవడం... కాసిన పత్తి నల్ల బారుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈసారి పెట్టుబడి కూడా వస్తదో రాదోనని ఆందోళన చెందుతున్నారు.

తెల్లబోతున్న పత్తి రైతు

వర్షాలతో నిలవని పూత, పిందె.. చేలల్లో తగ్గని పదును

అధికమైన చీడపీడలు.. ఆకుముడతతో ఎర్రబారిన చెట్లు

జిల్లాలో సాగు వివరాలు

సంవత్సరం	సాగు (ఎకరాల్లో)
2023	1,27,786
2024	1,76,174

మద్దతు ధర (క్వింటాలకు)

	2023-24	2024-25	పెరుగుదల
మధ్య రకం	6,620	7,121	501
పొడుగు రకం	7,020	7,521	501



యాచారం : నల్లబారిన పత్తి

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది తరచూ కురుస్తున్న వర్షాలకు పత్తి రైతు చిత్తయ్యేలా ఉన్నాడు. ముసురు వానలు పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వాతావరణంలో మార్పులు, తేమశాతం పెరగడంతో చేలల్లో పదును తగ్గడం లేదు. దీంతో రసం పీల్చే పురుగులు, పచ్చ, తెల్ల దోమ, నల్లితో ఆకుముడత, పండాకు, ఎండాకు వంటి పలు తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. పత్తి చెట్లకు పూత, పిందె రాలిపోతుండటంతో పాటు కాయలు నల్ల బారుతున్నాయి. చేతికొచ్చిన పత్తి తడిసి ముద్దవడంతో పాటు వేరుకుళ్లతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా నల్లమట్టి చెల్కల్లో పదును ఆరని ప్రభావం అధికంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతుందంటున్నారు. దీంతో ఈసారి దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు

మిగతా 8వ పేజీలో...

సీతాఫలం.. ప్రియం

ఏటేటా తగ్గుతున్న పండ్ల దిగుబడి

- తగ్గిన ఉత్పత్తి.. భారీగా పెరిగిన డిమాండ్
- బాక్స్ రూ.500-రూ.700 పలుకుతున్న ధర
- ఆమనగల్లు, పరిగి ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు
- ఫలాల సేకరణతో ఉపాధి పొందుతున్న కూలీలు

7



ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

ప్రమాదకరంగా పిల్లిపల్లి -నానక్‌నగర్ మధ్య రోడ్డు

- దారికి ఇరువైపులా పెరిగిన చెట్లు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక యాక్సిడెంట్లు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- భయాందోళనలో వాహనదారులు

8



దక్షిణ కొరియాలో జిల్లా ఎమ్మెల్యేలు



తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి తోపాటు జిల్లా ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్ దక్షిణ కొరియా (సియోల్) పర్యటనకు వెళ్లారు. సోమవారం ఆ దేశంలోని హన్ నదిని వారు పరిశీలించారు. ఆ నది పునరుజ్జీవం ప్రాతిపదికన నగరంలోని మూసీ నదికి కొత్త సొబగులు అద్దాలని ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టారు. - చేవెళ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి)

అంగట్లో సరుకులా చదువులు

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- విద్యతోనే సమాజాభివృద్ధి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నూతన జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన

షాద్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) విద్య అంగట్లో సరుకులా మారిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్య బలపడితేనే ప్రైవేటు విద్యాసంస్థలు మూతబడతాయన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో దాతల సహకారంతో నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో ఆత్మగౌరవం పెరుగుతుందన్నారు. 1950లో దాతల సహకారంతో ఇలా ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఆ తర్వాత ఇప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆ ఒరవడిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. దాతల సహకారంతో రూ.10 కోట్లతో జూనియర్ కళాశాల నిర్మించడం హర్షణీయమన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యతోనే సమాజాభివృద్ధి

విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దాతల సహకారంతో కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను తెలంగాణ రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందుకోసమే షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసిందన్నారు. తాను కూడా విద్య, వైద్యం కోసం కృషి చేస్తానని తెలిపారు. "నేను పేదింటి బిడ్డనని, పూరి గుడిసె నుంచే వచ్చి ఎమ్మెల్యేను అయ్యాను. నాకు ఇంతకంటే ఏమీ వద్దని, సంపాదనపైన ఎలాంటి ఆసక్తి లేదు. సమాజానికి ఏం చేస్తే బాగుంటుందో ఆలోచనతోనే ఉంటానని" చెప్పారు. అందుకే దాతల సహకారంతో జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు కళాశాల భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ నేటి తరంలో రాజనీతిజ్ఞులు తక్కువయ్యారని, రాజకీయ నాయకులు ఎక్కువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల కోసం రాజకీయ నాయకులు ఎంత కష్టపడతారో.. అదేవిధంగా సమ సమాజ స్థాపన కోసం కూడా అంతే కృషి చేయాలన్నారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, బీజేపీ నాయకుడు అందె బాబయ్య, టీడీపీ నేత చల్లా వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, రఘు, కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 84 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి 84 ఫిర్యాదు అందినట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 17, డీఈవోకు ఆరు విజ్ఞప్తులు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 52 అర్జీలు అందజేశారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలకు, జీహెచ్ఎంసీకి ఒక్కో దరఖాస్తు చొప్పున వచ్చాయి. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



ఆదాని పరిశ్రమ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అదానీ సంస్థ డ్రోన్ల సరఫరాను ఆపాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు వీరయ్య

మహేశ్వరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు అదానీ సంస్థ తయారు చేస్తున్న డ్రోన్లను సరఫరా చేయడం వెంటనే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు వీరయ్య, జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని పహాడిషరీఫ్ ప్రాంతంలో ఉన్న అదానీ పరిశ్రమ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇజ్రాయెల్ సైన్యం పాలస్తీనాపై జరుపుతున్న దాడిలో ఇప్పటివరకు 42 వేల మందికిపైగా మృతిచెందారని తెలిపారు. శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన సమస్యను సామ్రాజ్యవాద దురహంకారంతో జరుగుతున్న దాడికి భారత ప్రభుత్వం మద్దతు తెలుపుతూ క్షిపణుల సరఫరాకు అనుమతినిచ్చి ఇజ్రాయెల్‌కు సాయపడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, జగదీష్, కవిత, అలువాల రవికుమార్, అంజయ్య, శ్యాంసుందర్, వెంకటయ్య, కిషన్, పెంటయ్య, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఘట్‌కేసర్ రూరల్: వివిధ కేసుల్లో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలకు నేడు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పీఎస్‌లో మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక స్కూటీతో పాటు మూడు యాక్టివాలకు వేలం ఉంటుందని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

సకాలంలో పాల బిల్లులు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణ, తదితరులు

కడ్తాల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, కడ్తాల మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని టీఎస్‌డీడీసీఎఫ్ కార్యాలయంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం ఎదుట రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తి అయిన దుకాణ సముదాయాన్ని వెంటనే ప్రారంభించి వ్యాపారస్థులకు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాణా, పశుగ్రాసం కొనుగోలు, పాడి ఆవుల పోషణకు పాడిరైతులు అప్పులు చేయాల్సి వస్తుందని చైర్మన్‌కు వివరించినట్లు వారు పేర్కొన్నారు. ఈ అంశాలపై అమిత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో శంకర్ కొండ మాజీ ఉప సర్పంచ్ ప్రశాంత్ నాయక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పార్టీలో శ్రమించిన వారికి ప్రాధాన్యం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



అంబయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న అధికారులు

కొడంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. స్థానిక కేఎస్ఎవీ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, కార్యదర్శి చంద్రశేఖర్ సమక్షంలో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంబయ్యగౌడ్, వైస్‌చైర్మన్‌గా ఆకారం శేఖ, డైరెక్టర్లుగా నర్సింహులు, సేవ్యానాయక్, కోటం రాములు, ఆసిఫ్‌ఖాన్, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నమ్మ, మల్లికార్జున్, అంజిలయ్య, భాస్కర్ నాయక్, మల్లేశ్‌కుమార్, మహేశ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ముద్దప్పదేశ్‌ముఖ్, జగదీశ్వర్‌రెడ్డి, శివకుమార్‌గుప్తా, నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్ పాల్గొన్నారు.

అల్మాస్ స్కూల్, ఎంఈవోపై ఫిర్యాదు

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్మాస్ హైస్కూల్ అనుమతి లేకుండా నడిపిస్తున్నారని, ఈ విషయంలో తాండూరు ఎంఈవో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

నియామకం

అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సదానందంగౌడ్



ఆమనగల్లు , అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అయిల్ సదానందం గౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం గెస్ట్ లెక్చరర్స్ సంఘం(1145) గౌరవాధ్యక్షుడు డాక్టర్ మధుసూధన్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో సదానందంగౌడ్‌కు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం లభించింది. ఆయన రాష్ట్ర సాధన, అధ్యాపకుల హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలలో క్రియాశీలకంగా పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ భాష, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు భీమేశ్, బాల్‌రాజ్, సదానందంలకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్




కొత్తూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పెంజర్ల పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి హెచ్. సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సురేందర్ మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శక్తివంచన లేకుండా పంచాయతీ కార్యదర్శులు అభ్యున్నతికి పాటుపడుతానని పేర్కొన్నారు.

భళా.. చిత్రకళ!

- చిత్రకళలో మేటి.. సున్నపు అశోక్
- మనసులో మెదిలే భావాలకు రంగులు
- అనేక చిత్రాలకు ప్రశంసలు, అవార్డులు

దౌల్తాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన సున్నపు అశోక్ చిత్ర కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆయన డాక్టర్ సున్నపు ఆశప్ప, నర్సమ్మ దంపతుల కుమారుడు. తనదైన శైలీలో పలు కళాకృతులను ఆవిష్కరించి అబ్బురపరుస్తున్నాడు. చింత గింజలపై పలు దేశాల జాతీయ జెండాలు, బియ్యం గింజపై శివలింగం, విద్యుత్ బల్బులో జాతీయ చిహ్నాన్ని అమర్చి తన సృజనాత్మకతను చాటుకున్నాడు. సుద్ద ముక్కలతో కళాకృతుల తయారీ, పెన్సిల్‌పై పేర్లు చెక్కడం, కంది పప్పులతో ఆంగ్ల అక్షరాల తయారీ, కొబ్బరి చిప్పలతో పలు కళాఖండల తయారీ, ఐస్‌క్రీమ్ పుల్లలతో పలు చారిత్రాత్మక నిర్మాణాల తయారీ, రావి ఆకులపై రమణీయ చిత్రాలు, చిన్నపాటి బిస్కెట్లపై పలు మతాల చిహ్నాల తయారీ, కోడి గుడ్డు పెంకులపై జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల చిత్రాలను ఆవిష్కరించాడు. అప్పటి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మనవడితో సరదాగా బోసి నవ్వులతో గీసిన చిత్రం, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ఐఏఎస్ హరిచందన, శ్రీదేవి, మాజీ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చిత్రాలను పెన్సిల్‌తో గీసి వారికి బహుకరించి ఆకట్టుకున్నాడు.


పెన్సిల్‌తో గీసిన చిత్రం


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న అశోక్ (ఫైల్)


నీటిని తోడుతున్న రైతు చిత్రం

అశోక్ సాధించిన అవార్డులు

అశోక్ కళారంగంలో రాణిస్తున్న అశోక్ కృషిని మేజిక్ బుక్ ఆఫ్ రికార్డును హర్యానాకు చెందిన ఓ సంస్థ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. ఏకే తెలుగు మీడియా ముంబై వారు ఉత్తమ చిత్రకారుడిగా అవార్డు అందించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మహాత్మాగాంధీ అంతర్జాతీయ నోబెల్ శాంతి అవార్డు, స్వామివివేకానంద జాతీయ పురస్కారం, నవ భారత్ రాష్ట్రీయ జ్ఞానపీఠ్ అవార్డు, ఇంటర్ నేషనల్ యూత్ అవార్డు, పీవీ నరసింహరావు ప్రైడ్ ఇండియా అవార్డు, జాతీయ శివనంది, తదితర అవార్డులను అందుకొని ఆదర్శంగా నిలుస్తున్నాడు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

'కడా' ప్రత్యేకాధికారి వెంకటేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహన్ని అందిపుచ్చుకొని మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదుగుతూ, పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక సమాఖ్య భవనంలో నిర్వహించిన సమాశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల అభివృద్ధితో పాటు పిల్లల విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం మహిళలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహించే దిశగా ముందుకు వెళ్తుందన్నారు. రుణాలను పొందడంతో పాటు, చెల్లించడంలో అలసత్వం వహించొద్దన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు అంజిలమ్మ, తహసీల్దార్ విజయ్‌కుమార్, అడిషనల్ డీఆర్‌డీవో సరోజ, డీపీఎం వీరయ్య ఏపీఎం వెంకన్న, సీసీలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


క్రీడా జ్యోతిని పట్టుకున్న శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, సీనియర్ క్రీడా కారుడు మర్రి లక్ష్మారెడ్డి, తదితరులు

శామీర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యువతకు అవసరమైన క్రీడా సౌకర్యాలను కల్పించి క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎల్బీ స్టేడియంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభించిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఈ ర్యాలీని రాష్ట్రంలోని 32 జిల్లాల్లో పర్యటిస్తూ సోమవారం ఉదయం మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని దొంగల మైసమ్మ చౌరస్తా వద్దకు చేరింది. అక్కడికి ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు డీవైఎస్‌వో గోపాల్‌రావు హాజరయ్యారు. వారితోపాటు దాదాపు 450 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు క్రీడా జ్యోతిని పట్టుకుని రాష్ట్ర రాజీవ్ రహదారిలో దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి స్పోర్ట్స్ స్కూల్ వరకు టార్చ్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సీనియర్ ప్లేయర్ మర్రి లక్ష్మారెడ్డి, తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రూ.117 కోట్లు మంజూరు

- తాండూరు మండల పరిధిలోని రోడ్లకు మహర్దశ
- డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్


మాట్లాడుతున్న జిల్లా రవీందర్‌గౌడ్

తాండూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : తాండూరు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకే స్థానిక శాసనసభ్యులు బి.మనోహర్‌రెడ్డి రూ.117 కోట్లు మంజూరు చేశారని, ఆయన కృషి అభినందనీయమని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం తాండూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాండూరు మండలంలోని 12 గ్రామాలకు ఇంటర్నల్ రోడ్లు నిర్మాణం చేసేందుకు ఈ నిధులను కేటాయించారన్నారు. బషీరాబాద్-కరన్‌కోట్ 12కి.మీ రోడ్డుకు రూ.30 కోట్లు, మహబూబ్‌నగర్-చించోళి రోడ్డు మార్గంలోని తాండూరు పట్టణం సమీపంలో 4కి.మీ రోడ్డుకు రూ.35 కోట్లు, తాండూరు-వికారాబాద్ 39 కి.మీ. రోడ్డుకు రూ.101 కోట్లు, గౌతాపూర్-బెల్కటూర్ నుంచి వీరారెడ్డిపల్లి, చిట్టిఘనాపూర్, చంద్రవంచ, ఓగీపూర్ నుంచి కర్ణాటక సరిహద్దు సత్రశాల, కోటబాస్పల్లి నుంచి మల్కాపూర్ వరకు, జినుగుర్తి నుంచి సంకిరెడ్డిపల్లి మీదుగా గోపన్‌పల్లి, మిట్టబాస్పల్లి-బెల్కటూర్, అల్లాపూర్ నుంచి సిరిగిరిపేట్, కరన్‌కోట్ నుంచి జీవన్గి వరకు రోడ్ల నిర్మాణాల కోసం ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులను టెండర్ పూర్తి కాగానే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, డైరెక్టర్ జర్నప్ప, హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలంగౌడ్, సాయిలు, యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గని కార్మిక సంఘం అధ్యక్షుడు పండరి, బోయిని నర్సింహులు, వెంకటేశ్, హాజిపూర్ రాంరెడ్డి, నారాయణరెడ్డి, ఉప్పరి నర్సింహులు తదితరులు ఉన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి

డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్

వికారాబాద్, అక్టోబరు 21: ప్రజలందరూ అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలని డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్ సూచించారు. అలాగే అధిక మోతాదులో ఉప్పును వినియోగించడం వలన అనారోగ్యం సంభవిస్తుందని ఆయనసూచించారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు అన్నింటిని తగు పాళ్లలో తీసుకోవాలన్నారు. ప్రతీరోజు విధిగా వ్యాయామం చేయాలన్నారు. కొవ్వు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రం, పాఠశాలలో, కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో, గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అయోడిన్ ఉప్పు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాసులు సంబంధిత శాఖ అధికారులు జయరాం, రేణు కుమార్, ఏవో, సూపరింటెండెంట్లు, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మహేశ్వరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం పక్కనున్న దర్గా వద్ద సోమవారం ఓ వ్యక్తి మొక్కుబడి నిమిత్తంగా మేకను బలియ్యడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించలేదన్నారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు మాధవాచారి, యాదీష్, మధుమోహన్, సుధాకర్, యాదగిరిరెడ్డి, శ్రావణ్, బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు రాఘవేందర్, రాజు, ఈశ్వర్, వినోద్, రామ్‌రెడ్డి, అనీల్, మహేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి బీజేపీ కృషి


సభ్యత్వ నమోదులో పీవీఆర్

కేశంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని, బీజేపీ అభివృద్ధితో పాటు ఎక్కువ మందికి పార్టీ సభ్యత్వాలు ఇప్పించిన వారికే పదవులలో సముచిత స్థానం ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, దత్తాయపల్లి, వేముల్‌నర్వ, చింతకుంటపల్లి గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. నాయకులు తమ బూత్‌లో కనీసం 100 మందికి సభ్యత్వం ఇప్పించాలని సూచించారు. పార్టీ బలోపేతమైతే భవిష్యత్తులో ఎన్నో పదవులు పొందవచ్చని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామని వివరించారు. పార్టీ కోసం కష్టపడితే జడ్పీటీసీ, ఎంపీటీసీలయ్యే అవకాశం లభిస్తుందని తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు రొల్ల రఘురాములుగౌడ్, నాయకులు మధుసూదన్‌గౌడ్, పర్వతాలు, పద్మకృష్ణయ్య, జ్ఞానేష్, శేఖర్, వినయ్, విగ్నేష్, పారేశ్, నవీన్, గురుప్రసాద్, భిక్షపతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం

తాండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యమని తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అన్నారు. కళాశాలలో సోమవారం ఉమెన్ ఇన్ డాటా ప్రోగ్రాంను లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 'కృత్రిమ మేధా, సాంకేతిక పరిజ్ఞానంలో మహిళా సాధికారత' అనే అంశంపై 20గంటల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంజీవులు, కళావతి, విశాల, సత్యలక్ష్మి, బాబు, మమత, కిషన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందవాడ గేట్ నుంచి వయా పలుగుట్ట గ్రామం మీదుగా కందవాడ, నారాయణదాస్‌గూడ వరకు బీసీ రోడ్డు మంజూరైందన్నారు. ఇందుకు రూ.1.95కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, గ్రామాధ్యక్షుడు చిన్నరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జంగయ్య, రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అశోక్, రామయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలం.. ప్రియం



ఏటేటా తగ్గుతున్న పండ్ల దిగుబడి • తగ్గిన ఉత్పత్తి.. భారీగా పెరిగిన డిమాండ్

- బాక్స్ రూ.500-రూ.700 పలుకుతున్న ధర
- ఆమనగల్లు, పరిగి ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు
- ఫలాల సేకరణతో ఉపాధి పొందుతున్న కూలీలు



పరిగి/ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాలకు ఎగుమతి, డిమాండ్ పెరిగిన కారణంగా మార్కెట్‌లో సీతాఫలాలు ధరలు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో పెరిగాయి. రియల్ ఎస్టేట్ ప్రభావంతో చెట్ల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో కేవలం అటవీ ప్రాంతాలలోనే దిగుబడి వస్తోంది. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు ఆమనగల్లు, పరిగి ప్రాంతాల్లో ఉపాధి కోసం కూలీలు ఫలాల వ్యాపారాన్ని ఎంచుకోవడం ఆనవాయితీ. పెద్దల అమావాస్య మొదలుకొని నవంబర్ నెలాఖరు వరకు సీతఫలాల వ్యాపారం జోరుగా సాగుతుంది. అడవుల నుంచి సేకరించిన సీతాఫలాలను నగరాలకు రవాణా చేస్తుంటారు. రెండు నెలల పాటు అన్ని మార్కెట్‌లను ముంచెత్తే ఈ ఫలాలలో పోషక విలువలు కూడా అధికమే.

✦ సీతాఫలాల దిగుబడిలో రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల ప్రాంతాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. ఆమనగల్లు , కడ్తాల మండలాల పరిధిలోని చరికొండ, ముద్విన్, మైసిగండి, ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లి, వాస్‌దేవ్‌పూర్, కోనాపూర్, చెన్నారం, అన్మాస్‌పల్లి, చల్లంపల్లి, రాంనుంతల, అయ్యసాగర్, విఠాయిపల్లి, మంగళపల్లి, మాలెపల్లి తదితర గ్రామాలు సీతాఫలాలకు ప్రసిద్ధి. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై సీతాఫలాల విక్రయాలు జోరందుకున్నాయి. వంద కాయలు ఉన్న ఒక గంప సైజును బట్టి రూ.500 నుంచి రూ.600ల వరకు విక్రయిస్తున్నారు. పండు నాణ్యత, సైజును బట్టి రూ.20 నుంచి రూ.35 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు.

> అమృతఫలమైన సీతాఫలాల ధరలు భగ్గుమంటున్నాయి. ఏటేటా తగ్గుతున్న చెట్ల సంఖ్యతో ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ ఏడాది చాలినంత వర్షం కురువడంతో గతేడాది కంటే సీతాఫలాలు విరివిగా దొరుకుతున్నాయి. అయినా డిమాండ్ భారీగా పెరగడంతో ధరలు ఆకాశన్నంటుతున్నాయి. యాపిల్ ధరలను మించి పోటీపడుతున్నాయి. దీంతో అత్యంత పోషక విలువలు కలిగిన సీతాఫలాల రుచికి పేదలు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కాయల నాణ్యతను బట్టి డజన్ రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దొరుకుతున్న సీతాఫలాల లభ్యత, ధరలు, క్రయవిక్రయాలపై ప్రత్యేకం.

పరిగి నుంచి ఇతర ప్రాంతాలకు

వికారాబాద్ జిల్లాలోని పరిగి, కులకచర్ల, దోమ, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల్ మండలాల్లో సీతాఫలాల వ్యాపారం ముమ్మరంగా సాగుతోంది. పరిగి పరిధిలో కులకచర్ల, కొత్తపల్లి, అనంతసాగర్, రాంరెడ్డిపల్లి, పీరంపల్లి, కామునిపల్లి, ముజాహిద్‌పూర్, ఊటుపల్లి, కిష్టాపూర్, పూడూరు ప్రాంతాల్లోని అడవుల్లో లభ్యమయ్యే సీతాఫలాలను పరిగి తరలించి ఇక్కడి నుంచి హైదాబాద్, ముంబాయి తదితర నగరాలకు తరలిస్తున్నారు. అలాగే ముంబాయి, గోవా తదితర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు.


పరిగి శివారులో రోడ్డు పక్కన విక్రయాలు

భారీగా పెరిగిన డిమాండ్



దశాబ్ద కాలంగా కడ్తాలలో సీతాఫలాల విక్రయాలు సాగిస్తున్నాం. యేటా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. సీతాఫలాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు, అటవీ ప్రాంతాల నుంచి మేము సేకరించిన కాయలను పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో స్థానికంగా కాయలు దొరక్క ధర భారీగా పెరిగింది.
- ఆనంద్, సీతాఫలాల వ్యాపారి, కడ్తాల్

కాయలు బాగా పిరమైనవి



సీతాఫలాల చెట్లు బాగా తగ్గిపోయాయి. దీంతో దిగుబడి తగ్గి కాయలు పిరమైనవి. ధర పెరిగిన కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారే కొనుగోలుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మేము కూడ రైతు కూలీలు, గిరిజనుల నుంచి పెట్టె కాయలు రూ.800 నుంచి రూ.1,200ల వరకు తీసుకొని కూలీ గిట్టుబాటు చేసుకొని డజన్లు, కిలోల లెక్కన విక్రయిస్తున్నాం.
- గీత, సీతాఫలాల విక్రయదారు, కడ్తాల్

బాక్స్ రూ.600లకు విక్రయిస్తున్నాం



సీతాఫలాలతో రెండు నెలలపాటు ఉపాధి దొరుకుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో సీతాఫలాలకు మంచి ధర కూడా లభిస్తుంది. బాక్స్ ధర నాణ్యతను బట్టి రూ.450ల నుంచి రూ.700ల వరకు విక్రయిస్తున్నాం. ఇప్పుడు పనులు లేని సమయంలో సీతాఫలాల సేకరణతో మంచి ఉపాధి దొరుకుతుంది.
- వెంకట్, కూలీ, బొంపల్లితండా

కాశనకుంట చెరువు నీటి శాంపిల్స్ సేకరణ

పీసీబీ, ఇరిగేషన్ అధికారుల పరిశీలన

కొత్తూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో గల కాశనకుంట చెరువును పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. కాశనకుంట చెరువు సమీపంలో కొత్తూర్ పారిశ్రామికవాడ ఉండడంతో వివిధ పరిశ్రమలు వదులుతున్న వ్యర్థాలు, నీరు, రసాయనాలు కాశనకుంట చెరువులోకి వదులుతుండడంతో చెరువు కలుషితమవుతోంది. ఇటీవల చేపలు మృతువువాత పడడంతో మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పీసీబీ ఏఈ విద్యలత, షాద్‌నగర్ ఇరిగేషన్ ఈఈ ప్రతిమ, ఏఈఈ మనీషలు చెరువు పరిసరాలతో పాటు, నీటిని పరిశీలించారు. నీటి శ్యాంపిల్స్ సేకరించారు. ఏఈ విద్యలత మాట్లాడుతూ చెరువు నీరు కలుషితమవుతున్నాయని ఫిర్యాదు అందడంతో పరిశీలించడానికి వచ్చినట్లు చెప్పారు. శ్యాంపిల్స్ నీటిని ల్యాబ్‌కు పంపుతున్నామని, పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సులలో ఏడో విడతలో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ఐటీఐ, వికారాబాద్ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోనే వారు 30న ఉదయం 11 గంటలకు చేరుకోవాలన్నారు. పది, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ అవకాశం ఉందన్నారు. సంబంధిత ఆ వివరాలన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9177472488, 8555865421 నంబర్లను సంప్రదించాలలని సూచించారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ రాష్ట్ర నాయకుడు పర్వతాలు

శంషాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు ఒక ప్రకటనలో కోరారు. శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములపై పలువురు బడా నేతలు కన్నేశారని అన్నారు. రాత్రికిరాత్రే నక్షలను చెరిపి కంచెలను తొలగిస్తూ ఆక్రమిస్తున్నారన్నారు. కాగా, శంషాబాద్ పరిధిలోని సర్వేనెంబర్ 622లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

● ప్రమాదకరంగా పిల్లిపల్లి -నానక్‌నగర్ రోడ్డు
● దారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు
● ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు

యాచారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లిపల్లి-నానక్‌నగర్ గ్రామాల మధ్యగల ఆర్‌అండ్‌బీ రహదారి చాలా ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. పిల్లిపల్లిలో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి నుంచి నానక్‌నగర్ గ్రామాల మధ్య రహదారి చాలా ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి వద్ద పోలీస్ వాహనం(వ్యాన్) బోల్తాపడడంతో నలుగురు



ఇటీవల ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందడంతో రోడ్డును పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్)

వ్యక్తులతో పాటు కొందరు పోలీసులకు గాయాలైనాయి. నెలరోజుల క్రితం రెండు బైక్‌లు బోల్తా పడడంతో నలుగురు వ్యక్తులకు గాయాలైనాయి. ఇటీవల బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మహబూబ్‌నగర్ జిల్లా డిండి మండలం ఖానాపూర్‌నకు చెందిన మల్లేష్(32) దుర్మరణం చెందాడు. కాగాద, ఈ రహదారికి ఆనుకొని రోడ్డుకిరువైపులా వివిధ రకాల చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి వస్తున్నాయి. ఆ చెట్లను నరికివేయాల్సిన అవసరం ఉన్నా అధికారులకు పట్టింపులేకుండా పోయిందని పిల్లిపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నానక్‌నగర్ సమీపంలో మూడు చోట్ల చెట్లు రోడ్డుకు ఆనుకొని ఉండడంతో ఏరోజు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రోడుకిరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బాలికను వేధిస్తున్న యువకుడి రిమాండ్

శంషాబాద్ రూర్, అక్టోబర్ 21, అంధ్రజ్యోతి : కాలేజీకి వెళ్తున్న ఓ బాలికను తరచూ వేధిస్తున్న యవకుడిని రిమాండ్‌కు తరలించిన సంఘటన సోమవారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. నక్షత్రకాలనీలో తోటమాలిగా పనిచేస్తున్న సిద్దప్ప, కొడుకు గణేష్ (19) అదే కాలనీలో నివాసం ఉంటున్న ఓ బాలికను వేధిస్తున్నట్లు కుటుంబసభ్యులు రెండు రోజులక్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్ ఎదుట సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఆర్జీఐఏ సీఐ బాల్‌రాజ్ తెలిపారు. మార్కెట్ ఎదుట దాదాపు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేదు. ఈమేరకు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడి ఒంటిపై బ్లాక్ కలర్ ప్యాంట్, బ్లూకలర్ షార్ట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిస్తే ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం.. ఇద్దరిపై కేసు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన వ్యక్తులపై కేసు నమోదైన ఘటన చోటుచేసుకుంది. ఈమేరకు సోమవారం ఆర్‌జీఐఏ సీఐ బాల్‌రాజ్ వివరాలు తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 626/1లో అనంతయ్య, భీంరావులు జేసీబీలతో చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దాంతో ఆర్‌ఐ కృష్ణ ఘటన స్థలానికి చేరుకుని ప్రభుత్వ భూమిని ఎందుకు కబ్జా చేస్తున్నావని వారించగా వారిద్దరు ఆర్‌ఐతో వాగ్వాదానికి దిగారు. రెవ్యూనా అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డును కబ్జాదారులు తొలగించారు. దీంతో ఆర్‌ఐ, ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శంషాబాద్ మున్సిపల్, మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. మున్సిపల్, మండలంలో ఎక్కడైన ప్రభుత్వ భూములను కబ్జా చేసిన్నట్లు తెలిస్తే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఎవరైన పదేపదే భూములను కబ్జాచేసినట్లు తెలిస్తే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దిగుబడి దిగులు

(5వ పేజీ తరువాయి)

దిగులు చెందుతున్నారు. జిల్లాలో 1,76,174 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి సాగు చేశారు. గతేడాది 1,27,786 ఎకరాల్లో విస్తీర్ణంలో పత్తి సాగైంది. గతేడాదితో పోలిస్తే 48,388 ఎకరాలలో సాగు పెరిగింది. వాతావరణం అనుకూలిస్తే సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరకు పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆరంభంలో అనుకూలంగా కురిసిన వర్షాలతో రైతులు ఎన్నో ఆశలతో పత్తి పంట సాగు చేశారు. ఆ తర్వాత వర్షాలు లేకపోవడం, ఆలస్యంగా ముసురు వానలు కురవడం పంటకు నష్టం కలిగించింది. ముసురు కారణంగా చేలల్లో తేమ పెరిగి పదును ఆరక తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. చీడ పీడలతో పత్తి చెట్ల ఆకులు ఎర్రబారి ఎండిపోతున్నాయి. అంతేకాకుండా పూత, పిందె రాలిపోతుంది. పూత, కాత దశలో రసం పీల్చు పురుగులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగుళ్ల ఉధృతి అదుపులోకి రావడం లేదని, ఇప్పటికే వేల రూపాయలు ఖర్చు చేశామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఇలా..

రైతులు ఎకరం భూమిలో పత్తిని సాగు చేసేందుకు అయ్యే పెట్టుబడి ఇలా ఉంది. మూడు సార్లు దుక్కి దున్నడానికి రూ.4500, అచ్చు వేయడానికి రూ.1500, రెండు విత్తన ప్యాకెట్లకు రూ.1700, విత్తనాలు నాటేందుకు కూలీలకు 900, గొర్రు తోలడానికి రూ.6వేలు, కలుపు తీయడానికి రూ.5వేలు, మందులకు రూ.2 వేలు, ఎరువుల బస్తాలకు రూ.4 వేలు, మందుల పిచికారికి రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.

పత్తి కాయలు మసిబారుతున్నాయి



సీజన్ ఆరంభంలో వర్షాలు అనుకూలంగా కురిశాయి. 30 ఎకరాలు కౌలుకు తీసుకుని 15 ఎకరాల్లో పత్తి, మరో 15 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేశా. ఎకరానికి రూ.35 వేలకు పైగా ఖర్చు అయ్యింది. వర్షాల కారణంగా పత్తి కాయలు మసిబారిపోయాయి. గూడ మొత్తం రాలిపోతుంది. ఇలాగే వానలు పడితే పత్తి పంట పూర్తిగా పాడై దిగుబడి రావడం కష్టమే.

- దయ్యాల శ్రీశైలం, కొందుర్గు

నల్లబారుతున్న పత్తి

యాచారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలో 2,029 ఎకరాలలో రైతులు పత్తి పంట సాగు చేశారు. కాగా, పది రోజులుగా తరచూ వర్షాలు కురుస్తుండడంతో పంట తడసి ముద్దయ్యింది. అంతేకాకుండా పత్తి మసి పూసినట్లు నల్లగా మారుతుంది. మూడు ఎకరాలలో పత్తి సాగుకు రూ.లక్ష అప్పు చేశానని చౌదర్‌పల్లికి చెందిన రైతు జంగయ్య తెలిపాడు. వర్షాల కారణంగా ఈసారి పత్తి దిగుబడి రావడం కష్టమేనని మేడిపల్లికి చెందిన కలకొండ బీరప్ప ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ పత్తి రూ.5450కు దళారీలు కొంటున్నారని, కనీస మద్దతు ధర రూ.8500 ఉంటేనే గిట్టుబాటు అవుతుందని ధర్మన్నగూడకు చెందిన రఘుపతి, శ్రీశైలం చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరుతున్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

(5వ పేజీ తరువాయి)

స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. దేశంలో శాంతి భద్రతలను కాపాడేందుకు వేలాది మంది పోలీసులు తమ జీవితాలను ఫణంగా పెట్టారని గుర్తుచేశారు. కమిషనరేట్ పరిధిలో పోలీసు అమరుల కుటుంబ సభ్యుల యోగక్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్ర, పద్మజ, ప్రవీణ్‌కుమార్, ఇందిర, కరుణాకర్, అరవింద్‌బాబు, ఉషావిశ్వనాథ్, మనోహర్, శ్రీనివాసులు, మురళీధర్‌తోపాటు అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సైబరాబాద్ కమిషనరేట్‌లో...

సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ అవినాష్ మహంతి పాల్గొని పోలీస్ అమరవీరుల సూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో అమరులైన పోలీసు కుటుంబ సభ్యుల బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీలు డాక్టర్ జి వినీత్, కోటిరెడ్డి, బి.రాజేష్, కె.సురేష్, సీహెచ్ శ్రీనివాస్, కె.నరసింహ, కె.ప్రసాద్, సృజన, శ్రీబాలాదేవి, సాయిశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ అమరులకు ఘన నివాళి

కొత్తూర్/ఆమనగల్లు/కడ్తాల్, అక్టోబరు 21:(ఆంధ్రజ్యోతి) పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఎస్సై జి.శ్రీనివాస్, మురళీల ఆధ్వర్యంలో



కొత్తూర్ : కొవ్వొత్తుల ర్యాలీలో పోలీసులు, నాయకులు

పోలీస్ సిబ్బంది కొత్తూర్‌లోని ప్రధాన రహదారిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పోలీసు అమరవీరుల చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ హేమదేవేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, కర్రోళ్ల సురేందర్, నర్సింహ తదితరులున్నారు. పోలీసు అమర వీరులను ప్రజలు ఎప్పటికీ మరువరని ఆమనగల్లు ఎస్సై వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు స్టేషన్ ఎదుట గల దివంగత ఎస్సై కాసం హన్మంత్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సైలు యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది, నాయకులు కర్నాటి కొండల్‌రెడ్డి, కసిరెడ్డి రాంరెడ్డి, జూలూరి రమేశ్, గుజ్జరి నర్సింహ్మ, తదితరులు పాల్గొన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో అమర వీరులకు నివాళులర్పించారు. ఎస్సై వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు. ఎర్రోళ్ల రాఘవేందర్, దశరథ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, నర్సింహ, శ్రీను, నరేందర్ రెడ్డి, తదితరులున్నారు.



ఆమనగల్లు : దివంగత ఎస్సై హన్మంత్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సై వెంకటేశ్



కడ్తాల : నివాళులర్పిస్తున్న ఎస్సై వరప్రసాద్, నాయకులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

కేశంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని లేమామిడిలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, బొదునంపల్లిలో సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ, అల్వాలలో సీసీ రోడ్డు, సంగెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, అనుమగళ్ల రమేష్, కరుణాకర్‌రెడ్డి, అబ్బి సుందరయ్య, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లేమామిడిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

షాద్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గందె సురేష్‌ను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన నివాసంలో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్య వైశ్యులు వ్యాపారంతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. తాను ఎల్లవేళలా ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని, సమస్యలపై సంఘటితంగా పోరాడాలన్నారు. గందె సురేష్ మాట్లాడుతూ తామంతా షాద్‌నగర్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, గజవాడ వెంకటేష్, బెజుగం రమేష్, పెద్ది రామ్మోహన్, యంసాని శ్రీనివాస్, మలిపెద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి అభివృద్ధే నా అభిమతం : కసిరెడ్డి



కడ్తాలలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానే తప్ప తనకు ఎవరిపై ద్వేషం లేదని, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన అభిమతమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో, కడ్తాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై తహసీల్దార్లు లలిత, ముంతాజ్‌లతో కలిసి 85 మందికి చెక్కులు పంపిణీ చేశారు. ఆయా చోట్ల నిర్వహించిన సమావేశాల్లో కసిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తన గూర్చి వ్యక్తిగతంగా చేసిన విమర్శలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని, అభివృద్ధే తన అభిమతమని, తనను గెలిపించిన ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. జైపాల్‌యాదవ్ గూర్చి తాను ఎప్పుడూ వ్యక్తిగతంగా మాట్లాడలేదని, ఇకపై ఒక్కమాట మాట్లాడబోనని, ఏదైనా సందర్భంవస్తే గారు అని సంబోధిస్తానని, తాను సంస్కారం తెలిసినవాడిని కాబట్టే జైపాల్ యాదవ్‌ను వ్యక్తిగతంగా దూషించకుండా పాలసీలపై మాత్రమే ప్రస్తావించానని, కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన హామీల అమలుకు కృషిచేయలేదని మాట్లాడానని స్పష్టంచేశారు. జైపాల్ యాదవ్ తనపై మాట్లాడిన భాష పదజాలం ఉచ్చరించరాని విధంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కౌన్సిలర్ లక్ష్మణ్, మండల, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, మానయ్య, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నల్లవారి పల్లికి బీటీ రోడ్డు నిర్మాణం

మాడ్గుల మండలం నల్లవారిపల్లికి వీలైనంత త్వరగా బీటీ రోడ్డు నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మంజూరైన రూ. కోటి నిధులకు తోడు అవసరమైతే మరో కోటి రూపాయాలు అందిస్తామన్నారు. నల్లవారిపల్లికి బీటీ రోడ్డు నిర్మించాలని సోమవారం గ్రామ నాయకులు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. అవురుపల్లి నుంచి నల్లవారి పల్లికి ఇప్పటికే మంజూరైన రోడ్డు నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయించాలని, నల్లవారి పల్లి నుంచి చంద్రాయన్‌పల్లికి, మాడ్గుల రోడ్డు నుంచి నల్లవారి పల్లికి బీటీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఏడాది లోపు చంద్రాయన్‌పల్లి, మాడ్గుల బీటీరోడ్ల నిర్మాణం చేయిస్తానని, మంజూరైన అవురుపల్లి-నల్లవారిపల్లి బీటీ రోడ్డు నిర్మాణం పనులు వీలైనంత తొందర ప్రారంభిస్తామని తెలిపారు. కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, గ్రామ నాయకులు ఇటికాల వెంకట్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సుఖజీవన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి, కిరణ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పెద్దయ్య, మల్లేశ్, సంపత్, తదితరులున్నారు.

కుల వృత్తులకు బీఆర్‌ఎస్ పెద్దపీట



కందుకూరు : గుమ్మడవెల్లి వాసులకు కిట్లు అందిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం/కందుకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుల వృత్తుల వారిని కంటికి రెప్పలా కాపాడుకునేదని, వారికి పెద్దపీట వేసినట్లు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మీర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం, కందుకూరు మండలాల పరిధిలోని పలువురు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను ఆమె అందించారు. సబిత మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాజకీయాలకతీతంగా అన్నికులాల వారికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగించామని.. కాంగ్రెస్ ప్రజాపాలన పేరుతో అభివృద్ధిని మరిచి హామీలను గాలికొదిలేసి చోద్యం చూస్తోందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతీ గీత కార్మికుడి అభివృద్ధికి తమవంతు సహాయసహకారాలు ఉంటాయన్నారు. మహేశ్వరం మండల నాయకులు మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, దేవవరంగౌడ్, వర్కల యాదగిరిగౌడ్‌లతో పాటు పోతుల నర్సింగ్‌పటేల్, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, రాయప్ప, ఆయా గ్రామాల గీత కార్మికులున్నారు. అలాగే మహేశ్వరం ఎక్సైజ్ సీఐ తిరుపతిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, జి.గోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, జి.సామయ్య, తాండ్ర దేవేందర్, తదితరులు పాల్గొన్నారు,

ఓపెన్ స్కూల్ ఏ-1 సెంటర్‌గా కొత్తూర్ ఉన్నత పాఠశాల

కొత్తూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ ఏ-1 సెంటర్‌గా స్థానిక ఉన్నత పాఠశాలను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ఎంఈవో అంగోర్‌నాయక్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు కొత్తూర్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారని తెలిపారు. 15 సంవత్సరాల నిండి చదవడం, రాయడం వచ్చిన యువతీ యువకులు నేరుగా పదో తరగతి అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే పదో తరగతి ఉత్తీర్ణత చెంది ఒక సంవత్సరం గ్యాప్ ఉన్నట్లయితే ఒకేసారి ఇంటర్మీడియట్ పూర్తి చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోపు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. కొత్తూర్ పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో అంగోర్‌నాయక్ పేర్కొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిబట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నేరం చేస్తే చట్టం పరిధిలోపడే శిక్షలపై, పోలీసు వ్యవస్థపై ప్రతీ వ్యక్తి కనీస అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమాజంలో జరిగే నేరాలను నివారించగలమని ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు ఫీల్డ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. పీఎస్‌కు వచ్చిన విద్యార్థులకు సీఐ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, కేసు నమోదు, దర్యాప్తు, రిమాండ్ వరకు జరిగే ప్రక్రియను, పోలీస్ వ్యవస్థలో లాఅండ్‌ఆర్డర్, క్రైమ్, ఎస్వోటీ, ఎస్‌బీ, ఐబీ, ట్రాఫిక్ విభాగాలు అవి పనిచేసే తీరు డీఎస్‌ఆర్, జీడీ ఎమ్‌టీ వంటి అనేక విషయాలు విద్యార్థులతో పంచుకున్నారు. సీఐ, ఎస్సై చాంబర్లు, కౌన్సిలింగ్, కేసు విచారణ విభాగాలు, లాకప్ గదులను విద్యార్థులకు చూపించారు. ఎస్సైలు వెంకటేష్, రాజు, పోలీస్ సిబ్బంది, టీచర్లున్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న సీఐ

లగ్గం సినిమాను ఆదరించండి

శంకర్‌పల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వాతావరణంలోని పచ్చని పైరులు, పల్లెల్లోని జీవన శైలి, బంధాలు-బంధుత్వాలు ముఖ్యమని తెలుపుతూ వివాహం ఇతివృత్తంగా సాగే లగ్గం సినిమాను ఆదరించాలని చిత్ర నిర్మాత సిభిషి డెవలపర్స్ అధినేత వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మోకిలలోని సుభిషి కాంప్లెక్స్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 25న తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ థియేటర్లలో లగ్గం సినిమా విడుదల కానున్నదన్నారు. బంధాలు, బంధుత్వాలకు ప్రాముఖ్యతనిస్తూ, గతంలో పెళ్లిని ఒక పండుగలా జరుపునేవారని గుర్తుచేశారు. అయితే, నేటి ఉరుకులు, పరుగుల జీవితంలోని సాఫ్ట్‌వేర్ కాలంలో అందరం సాంప్రదాయాలను మరిచిపోయి పెళ్లిని మొక్కుబడిగా ముగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు, కట్నకానుకలు ముఖ్యంకాదని, బంధాలు-బంధుత్వాలే ముఖ్యమని తెలుపుతూ లగ్గంను ఇంటిముందర పచ్చని పందిరి వేసి జరిపిస్తే పండుగలా ఉంటుందని ఈ మా సినిమా తెలియజేస్తుందని వివరించారు. ఇంటిల్లిపాది కలిసి చూసేది లగ్గం సినిమా అని, తాము చేసిన ఈ చిన్న ప్రయత్నాన్ని అందరూ ఆదరించాలని కోరారు. కాగా, రమేష్ చెప్పాల కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించగా.. సుభిషి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై లగ్గం సినిమాకు తాను నిర్మాతగా వహించినట్లు చెప్పారు.



వేణుగోపాల్‌రెడ్డి, నిర్మాత

అధైర్య పడొద్దు అండగా ఉంటాం

కడ్తాల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):నిరుపేదలు, బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 3వ వార్డులో సోమవారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన చెన్నయ్య కుటుంబాన్ని శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి వ్యక్తిగతంగా రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు గురిగళ్ల లక్ష్మయ్య, మంకి శ్రీను, భిక్షపతి, మల్లేశ్ గౌడ్, రాజు, జంగయ్య, శ్రీకాంత్, రమేశ్, జంగయ్య, బాబు, సురేశ్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలి

కడ్తాల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్‌నాయక్ కోరారు. చరికొండకు చెందిన మహ్మద్ హుస్సేన్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. దశరథ్ నాయక్ చొరవతో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సహకారంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వం ద్వారా రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. సోమవారం కడ్తాల మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి దశరథ్ నాయక్ ఎల్‌వోసీ చెక్కు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న దశరథ్ నాయక్

ప్రజల సహకారంతోనే ప్రగతి సాధ్యం


ఆమనగల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే ప్రగతి ఆశించిన రీతిలో సాధ్యపడుతుందని కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. 14వ వార్డు ఉదయ్ నగర్ కాలనీలో టీయుఎఫ్‌ఐడీసీ నిధుల ద్వారా రూ.60లక్షలతో చేపట్టే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులను సోమవారం లక్ష్మణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మోహిన్, షర్ఫోద్దీన్, అలివేలు, కత్తయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆమనగల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమనగల్లు పశువైద్య అధికారి డాక్టర్ అగ్నివేశ్ కోరారు. పోలెపల్లిలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి ఆవులు, గేదెలకు గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 326 ఆవులు, 12 గేదెలకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానోద్దీన్, పాలాక్ష, గోపాల మిత్రలున్నారు.

రక్తదానంపై అపోహలు వీడాలి

ఆమనగల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రజలు అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగానిలువాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్, లయన్స్‌క్లబ్ జిల్లాచైర్మన్‌లు జూలూరి రమేశ్, నటరాజ్ యాదయ్య, కసిరెడ్డి రాంరెడ్డిలతో కలిసి లక్ష్మారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. నాయకులు రామకృష్ణ, శ్రీను, భీమయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులున్నారు.



శిబిరాన్నిప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. ఎస్‌ఏ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఆకుతోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటీవ్ అసెస్‌మెంట్ పరీక్ష తీరును పరిశీలించి టీచర్లకు పలు సూచనలు చేశారు. ఎంఈవో పాండు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యాల పూర్తికి ప్రత్యేకాఅధికారులు, కార్యదర్శులు కృషి చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

సేవా కార్యక్రమాలలో పోటీ పడాలి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సామాజికసేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పోటీ పడాలని ఎస్సై బి.వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లాచైర్మన్‌లు రమేశ్, నటరాజ్ యాదయ్య, కసిరెడ్డి రాంరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ పరీక్షిత్ నరేంద్రలతో కలిసి ఎస్ఐ వెంకటేశ్ ప్రారంభించారు.

సీపీఎం బలోపేతానికి మహాసభలు

కందుకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీపీఎంను మరింత బలోపేతం చేయడానికి గ్రామాల వారిగా గ్రామశాఖ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నేదునూరు, కందుకూరు గ్రామ శాఖ మహాసభలను ఏర్పాటు చేశారు. మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు మరికొంత మంది నిరుద్యోగులకు చేయూతనందించి ఉద్యోగాల కల్పనకు తోడ్పాటునందించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్ కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ నవచైతన్య కాలనీ నిరుపేద కుటుంబానికి చెందిన జంతుక యాదయ్య ఇటీవల టీచర్ ఉద్యోగం సాధించాడు. సోమవారం మైసమ్మ గుడి ఆవరణలో యాదయ్యను కాలనీవాసులతో కలిసి సత్కరించారు. వస్పుల శ్రీశైలం, రాజు, కష్ణ, అశోక్, బాల్‌రాజ్, బాలరామ్, వస్పుల మల్లేశ్, జంతుక మహేశ్, యాదగిరి, శేఖర్, సురేశ్, తదితరులున్నారు.

ఆసుపత్రి పనులు నాణ్యతగా చేపట్టాలి

ఆమనగల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులను నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో రూ.17.50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. పక్కనే ఉన్న హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి కంటే ఎత్తు మరికొంత ఎక్కువగా పెంచి స్లాబ్ నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, మాజీ ఎంపీపీ అనితవిజయ్, కాంగ్రెస్ మండఅధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

యాచారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివనపర్తికి చెందిన జలజ అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివింది. ఆమె భర్త నందు ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న క్లాస్‌మేట్స్ జలజకు రూ.50వేల ఆర్థికసాయం అందించారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

మాడ్గుల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కేటీఆర్ పిలుపు మేరకు రైతు బంధు, రుణమాఫీపై నిరసన తెలిపారు. ఈమేరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ కార్యకర్తలు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. రాస్తారోకో, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేలు అందించాలని కోరుతూ తహసీల్దార్ వినయసాగర్‌కు వినతి పత్రం ఇచ్చారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.